# విరిగిపోయిన అతి పెద్ద గోళ్లు....



పక్క ఫొటోలోని మహిళను చూసి, ఆమె గోళ్లను చూసి దెయ్యమో భూతమో అని భయపడిపోకండి. ఈ మహిళ ఈ గోళ్లను అపురూపంగా గత 30 సంవత్సరాల నుంచి పెంచుకుంటూ వస్తోంది. చాలా మంది మహిళలు శరీరంలో అన్ని భాగాలకన్నా చేతి గోళ్లంటే ఎక్కువ ఇష్టపడతారు. ఇవి చేతులకు అందాన్నీ నాజూకుతనాన్ని తీసుకొస్తాయి. అందుకే వీటిని ప్రేమగా, అపురూపంగా చూసుకుంటారు. వీటిని కట్ చేయడమంటే శరీరంలో ఒక భాగాన్ని కోసేసినంతగా బాధ పడేవారూ ఉన్నారు. కొద్దిగా పెరిగిన గోళ్లు విరిగితేనే బాధపడితే.... మరి ప్రపంచంలోనే అతి పెద్ద గోళ్లగా నమోదైనవి విరిగిపోతే....సరిగ్గా ఇదే జరిగింది. 30 సంవత్సరాల నుంచి పెంచుకుంటూ వస్తున్న గోళ్లను ఓ ప్రమాదంలో కోల్పోయిన ఈ మహిళ ఉదంతం ఇది. వివరాల్లోకి వెళితే....

జపాన్‌లోని సాల్ట్‌లేక్ సిటీకి చెందిన లీ రెడ్ మాండ్(60) అనే మహిళ గోళ్లు ప్రపంచంలోనే అతి పెద్దవిగా గిన్నీస్ బుక్‌లోకి ఎక్కాయి. ఆమె 1979 నుంచి అంటే దాదాపు 30సంవత్సరాలుగా తన గోళ్లను కట్‌చేయకుండా కాపాడుకుంటూ వస్తోంది. వీటి రక్షణకు ఇప్పటి వరకూ ఆమె దాదాపు ఐదు లక్షల రూపాయలను ఖర్చు చేసింది. అంత అపురూపంగా చూసుకుంటున్న గోళ్లు ఇటీవల జరిగిన ఓ కారు ప్రమాదంలో విరిగిపోయాయి. లీ రెడ్‌మాండ్ స్వల్పంగా గాయపడగా ఆమెను చికిత్స నిమిత్తం హాస్పిటల్లో చేర్పించారు. విరిగిపోక ముందు ఆమె గోళ్లు 33 అంగుళాల పొడవు ఉన్నాయి. 2008లో ఈమె గోళ్లు గిన్నీస్ బుక్‌లోకి ఎక్కాయి. అప్పుడు అన్ని వేళ్ల గోళ్ల పొడవు కలిపి 28 అడుగుల 4.5 అంగుళాలుగా నమోదు అయ్యాయి. ఒక్క చూపుడు వేళ్ల గోళ్ల పొడవే 35 అంగుళాలుగా లెక్క తేలింది.

*

## 'సరసి' కత

వైశంపాయనుడు కొంతకాలం తిరుపతిలో చదువు వెలగబెట్టేడు. ఆ రోజుల్లోనే అతడి పెళ్లి సెటిలయ్యింది. తిరుపతి వెడితే అల్లుడు త్వరగా దైవదర్శనం చేయిస్తాడనీ, పనిలో పనిగా అతడి హాస్టల్ కూడా చూసేస్తే అతడి గురించి ఒక అంచనాకి రావచ్చునని అనుకుని (కాబోయే) మామగారు తిరుపతి వెళ్లాడు.

'సుబబుల్'(తన కాబోయే భార్యకి తనుపెట్టుకున్న ముద్దు పేరు) దృష్టిలో తను గొప్పగా కనిపించాలని, మామగార్ని రైల్వే స్టేషనులోనే గొప్పగా రిసీవ్ చేసుకుని, ముందుగానే బుక్ చేసిన కాటేజీకి తీసుకువెళ్లాడు వైశంపాయనుడు. కాలకృత్యాల అనంతరం ఆయన్ని సైకిల్ వెనక కూర్చోబెట్టుకుని వాయువేగంతో తొక్కి, రెండు మైళ్ల దూరంలో తనుండే హాస్టల్‌కి తీసుకొచ్చాడు. హాస్టల్‌కు చేరుకున్నాక జేబులో చెయ్యి పెడితే గది తాళం చెవి లేదు. దాన్ని మామగారి కాటేజీలో సోఫాలో కూర్చున్నప్పుడు




# తాళం చెవులు

మరిచిపోయుంటాడు. మామగారికి 'సారీ' చెప్పి, ఆయన్ని అక్కడే కూర్చోమని, రివ్వున కాటేజీకి వచ్చేడు సైకిల్ మీద. కాటేజీకి చేరుకుని తీద్దామనుకునే సరికి గుర్తుకొచ్చింది, కాటేజీ తాళం చెవి మావగారి నుంచి తీసుకోవడం మరిచిపోయిన సంగతి.

ఛ! అని తనని తానే తిట్టుకున్నాడు. నీరసంగా సైకిలెక్కి ఈ(ఏ)డుస్తున్నట్టు తొక్కుకుంటూ హాస్టల్‌కి చేరుకుని, మావగారికి మళ్లీ 'సారీ' చెప్పి, ఆయన నుంచి కాటేజీ తాళం చెవి అడిగి తీసుకుని, సైకిలెక్కి కాటేజీకి వచ్చి తాళం తీసి, హాస్టలు తాళం చెవులు తీసుకుని, తిరిగి హాస్టలుకు వెళ్లేడు. అప్పటికి మధ్యాహ్నం పన్నెండయింది. పొద్దున్నించి తిండి తిప్పలు లేక నీరసం కమ్మేసిన మావగారు అల్లుడిని చూడగానే అదోలా నవ్వి "కొండ ఎక్కకుండానే దైవ దర్శనం ఇక్కడే అయింది బాబూ!" అన్నాడు.

తన నిర్వాకం వల్ల ఎక్కడ తన మీద నెగెటివ్ ఇంప్రెషన్ పడిపోతుందో, ఎక్కడ పెళ్లి క్యాన్సిల్ అయిపోతుందోనని ఆ తర్వాత తెగ వర్రీ అయిపోయాడు వైశంపాయనుడు. అటువంటిదేం జరగలేదు. పెళ్లి జరిగింది.

"ఈ విషయం ముందే తెలుసుంటే ఇంత మతిలేని మొగుణ్ణి కట్టుకునే దాన్నే కాదు, ఇప్పుడు అనుభవిస్తున్నాను!!" అంటూ సందర్భం వచ్చినపుడల్లా దెప్పి పొడుస్తూనే వుంది సుబ్బాయమ్మగారు.

*